


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA
RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 89 | 14-06-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00

# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

4

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13:**

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం లో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు.





2

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

### ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ



మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు.



## అసోంలో కుప్పకూలిన భారత వైమానిక దళ విమానం

### ఐదుగురు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు.

2



## విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

### భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం

### రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్

2

## జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

### అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు

**హైదరాబాద్,**

జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో అ÷-దదె ఇంట్లో బంగ్లా జాతీయులు నివాసం ఉంటున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తించారు. ఇతర డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లోనూ బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు వీరిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు.

2



## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు షబ్బీర్ అలీకి ఎఐసిసి షోకాజ్ నోటీస్

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

2



### కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క

### పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి

కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.



## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

2

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

### దర్శనానికి 24గంటల సమయం

**తిరుమల,**

వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిట లాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది.

## ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్,**


ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.



## ప్రతికూల వాతావరణం

### శంషాబాద్ విమానాల దారి మళ్లింపు

**హైదరాబాద్,**



భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, దిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

# ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

## విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి



భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

### ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

### ఐదుగురు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం

గౌహతి, అక్షరకలం ప్రతినిధి

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

### 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.


## విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

### భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం

### రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్

చెన్నై, అక్షరకలం ప్రతినిధి

తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీకి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్లి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ - సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు- కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ - సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్లి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ - సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.



## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

### కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క

### పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హమీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేందప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

### షబ్బీర్ అలీకి ఎఐసిసి షోకాజ్ నోటీస్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో లింగనిర్ధారణ

### డెకాయ్ ఆపనరేషన్‌లో గుర్తించిన పోలీసులు

హైదరాబాద్,

వనస్థలిపురంలో లింగ నిర్ధరణ పరీక్షల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హయగ్రీవ ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఈ విషయం బయట పడింది. తొలుత మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపించారు. లింగనిర్ధరణ పరీక్షల గురించి ఆరా తీయగా.. చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్, రిసెప్షనిస్ట్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమెను తుక్కుగూడ ల్యాబ్ టెక్నీషియన్ వద్దకు రిఫర్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీసాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్‌కు చేరుకున్న పోలీసులు.. అక్కడ లింగ నిర్ధరణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హయగ్రీవ ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజు, లోకేశ్, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

### తాళం పగులగొట్టి సోదాలు చేశారని టిఎంసి ఆరోపణ

కోల్‌కతా, అక్షరకలం ప్రతినిధి

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు. భవానీపూర్‌లోని ఆయన నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి ఈడీ ఈ దాడులు జరిపినట్టు చెబుతున్నారు.

## పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

### విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ

సంగారెడ్డి, అక్షరకలం ప్రతినిధి

పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది,

## రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి

### మందకృష్ణ మాదిగ డిమాండ్

అక్షరకలం నల్గొండ

1950 రాష్ట్రపతి ఉత్తర్వులు దళితుల మెడ మీద కత్తిలాగా వేలాడుతున్నాయని, రాజ్యాంగ విరుద్ధమైన ఈ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని లేదా దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. నల్లగొండలోని లక్ష్మి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన దళిత క్రైస్తవుల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ దేశంలో ఏ మతంలోకి వెళ్లినా దళితులపై సామాజిక వివక్ష, అవమానాలు, అకృత్యాలు మారడం లేదని మందకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవంలోకి వెళ్లిన అగ్రకులాలు, బీసీలు, ఎస్టీలు వారి రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు.. కేవలం దళితులకే ఎందుకు ఈ ఆంక్షలు అని ప్రశ్నించారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కోల్పోవడానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని విమర్శించారు. గతంలో దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నా కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే 1950 ఉత్తర్వులను రద్దు చేయకుండా దళిత క్రైస్తవులకు నమ్మకద్రోహం చేసిందన్నారు. దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాపై సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఏ రాజకీయ పార్టీ కూడా నోరు విప్పలేదని మండిపడ్డారు. సిక్కు, బౌద్ధ దళితులు పోరాడి ఎస్సీ హోదా సాధించుకున్నట్లుగానే.. దళిత క్రైస్తవులు కూడా ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ స్ఫూర్తితో ఆత్మస్థైర్యంతో లక్ష్యం వైపు ప్రయాణించి హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు, పసల శౌరయ్య, తీగల జాన్ శాస్త్రి, సమర్పన్ కుమార్, కొంపెల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లో పిల్లలను చేర్పించండి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు

– గాధిర్యాల్ ఫ్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ బి. మౌనిక

**మహమ్మదాబాద్, జూన్ 13 (అక్షర కలం):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లలో గ్రామంలోని 3, 4, 5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా చేర్పించాలని గాధిర్యాల్ ఫ్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ బి. మౌనిక పిలుపునిచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు, విద్యా సామగ్రి, రెండు పూటల భోజనం వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, ఇతర ఖర్చులతో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితులకు దూరంగా ఉండేందుకు ప్రభుత్వ ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పాఠశాలలను ఏర్పాటు చేసిందని చెప్పారు. గ్రామంలో అందుబాటులో ఉన్న ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లో పిల్లలను చేర్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# పేదల భూములకు అండగా నిలబడదాం.,---- సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు.

**అక్షర కలం / ఇల్లందు.**

ఇల్లందు మండలం మామిడి గుండాల ప్రాంతంలోని పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను దొరలు, భూస్వాములు ఆక్రమించడం చట్ట విరుద్ధమని పేదలకు అందరం అండగా నిలబడాలని సిపిఐ(ఎంఎల్( న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు అన్నారు. శనివారం మామిడి గుండాలలో ఆదివాసి, గిరిజన, పేద రైతులతో అఖిలపక్షం నాయకులు ఎట్టి వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీలో అవునూరి మధు మాట్లాడుతూ ఇల్లందు మండలం మామిడి గుండాల ప్రాంతంలో జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో రాఘవేందర్ రావు అనే భూస్వామి మామిడి గుండాల ప్రాంతంలోని అడవులను అధికారాన్ని అడ్డం పెట్టుకొని 3,700 ఎకరాలు పట్టా చేయించుకున్నారని తెలిపారు. ఈ అడవిని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పేదలు ఆదివాసీ,గిరిజనులు నరుక్కుని 50



సంవత్సరాలుగా సేద్యం చేస్తూ జీవిస్తున్నారని అన్నారు. న్యూ డెమోక్రసీ ఉద్యమ ఫలితంగా 2, 800 ఎకరాల భూమిని సీలింగ్ కింద కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున పేదలకు పంచుతున్నామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, కానీ నేటికీ ఆ భూమికి హద్దులు చూపించలేదని తెలిపారు. నాటి భూస్వాముల వారసులు నెమరగొమ్ముల శీను బాబు, ఉమామహేశ్వరరావు, శ్యాంసుందర్రావు లు తిరిగి పేదల భూమిని ఆక్రమించుకోవడానికి గత మూడు రోజుల నుండి ఆధునికమైన యంత్రాలతో ఆక్రమించాలని చూస్తున్నారని తెలిపారు.

అలాగే తమ భూములను రక్షించుకోవడానికి ప్రయత్నించిన ఆదివాసీలను ప్రభుత్వ అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని, ప్రజలు సేద్యం చేసుకునే భూముల్లో ట్రంచులు కొడుతున్నారని, భూస్వాముల, ప్రభుత్వ అధికారుల ఈ వైఖరిని అఖిలపక్ష నాయకులు ఖండించారు. అక్కడున్న పేద ఆదివాసి గిరిజనులు అమాయకులని ఏమీ చేయలేరని ఈ భూములను దౌర్జన్యంగా ఆక్రమించడానికి దొరలు వస్తున్నారని జెండాలకు అతీతంగా ఈ భూమి రక్షణ కోసం ఐక్యంగా నిలబడాలని అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు, కుల సంఘాలకు, హక్కుల సంఘాలకు, మేధవులకు పిలుపునిచ్చారు. మామిడి గుండాలలో సీలింగ్ కింద తీసిన పేదల భూములకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న భూస్వాములపై నాన్బెయిల్ కేసులు నమోదు చేయాలని, ఈ భూములను సేద్యం చేసుకుంటున్నా రైతులకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి గుండాల ప్రాంతంలోని ఆదివాసి గిరిజన ప్రజలకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అండగా నిలబడుతుందని, పేదల సీలింగు భూములు నిలబెట్టుకోవడానికి ఐక్యంగా ముందుకు రావాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, చల్లసముద్రం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు,మండల నాయకులు బొగ్గారపు వెంకన్న, కల్తీ సీతారాములు,చింత భాస్కర్ తుడుం దెబ్బ నాయకులు ఈసం కృష్ణ, మంగయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి మామిడి గుండాల ప్రాంత నాయకులు జంపయ్య, ఈసం భద్రయ్య, హుస్సేన్,రాందాస్, బాలాజీ, ధర్మ, సువర్ణపాక రాంబాబు, ముక్తి రాజ్ కుమార్, పద్మ,మాధవి,రాజేష్, మోహన్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారాన్ని తగ్గించేది ఎవరు?

## బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13:**



ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారాన్ని తగ్గించేది ఎవరని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోందని అన్నారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఫీజులను తమ ఇష్టానుసారంగా పెంచి, తల్లిదండ్రుల శ్రమ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజుల భారాన్ని తగ్గించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

# తెలుగును సరళతరం చేస్తే తెలుగు కలకాలం నిలుస్తుంది

## తెలుగు సులభతరం “లిపి” సృష్టికర్త చంద్రగిరి వెంకటేశ్వర్లు ఎంపిపిఎస్ బస్వాపురం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



తెలుగును సరళతరం చేస్తే తెలుగు కలకాలం నిలుస్తుందని, అటువంటి తెలుగును మరింత అర్థవంతంగా సులభతరంగా చేసి ప్రపంచానికి తెలియజేసేందుకు తన వంతు పాత్రగా తెలుగును సరళతరం చేసేందుకు “లిపి” ని కనుగొన్నట్లు ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం ఎంపిపిఎస్ బస్వాపురం కు చెందిన ఉపాధ్యాయుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇసుక దిబ్బలపైన, తాళపత్ర గ్రంథములపై, శిల్పాలపైన చెక్కిన ప్రతి సందర్భంలోనూ మన పూర్వీకులు “లిపి” సరళతకు చోటు కల్పిస్తూ వచ్చారు. అలా రేపటి డిజిటల్ యుగపు అవసరాలకు అనుగుణంగా అక్షరాలను సంస్కరిస్తే అనే ఆలోచనతో తెలుగు భాషను తరళతరం చేయడం ద్వారా ఇప్పటి తరం తెలుగును నేర్చుకునేలా చేస్తే తెలుగు వెలుగు ఎప్పటికీ బ్రతికి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థి దశలో ఉన్న వారు తెలుగును నేర్చుకోవడంలో ఎన్ని ఇబ్బందులు పడుచున్నారో మనం గమనిస్తున్నామని, ఇంగ్లీషు భాషను నేర్చుకున్నంత త్వరగా తెలుగును నేర్చుకోవడంలో విఫలం చెందుతున్నారని, దీనికి అతి పెద్ద కారణం ఒత్తులు. ఒత్తులకు ఎటువంటి ప్రాధాన్యత లేకున్నా, ఆ ఒత్తులను గుర్తు పెట్టుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో ఒత్తులను ఉపాక్షర సహిత, హంసగీత ఆధారంగా సంస్కరిస్తే మన తెలుగు మరింత వికసిస్తుందని, శ్రీశ్రీ స్ఫూర్తిగా ముత్యాల్లాంటి తెలుగక్షరాలంటూ లిపి మీద లేనిపోని సెంటిమెంట్ పెట్టుకోవడం మాని, దాన్ని సంస్కరించినట్లయితే తన నిశ్చిత అభిప్రాయంగా ఆయన ప్రపంచ తెలుగు మహాసభ వారు ఈ విషయమై ఆలోచించడం మంచిదని “అనంతం” (1975 సం॥లో) అనే పుస్తకంలో 196వ పేజీలో ఉటంకించారని గుర్తు చేశారు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది తెలుగు లిపిని సంస్కరిస్తే కలకాలం తెలుగును భావతరాల వారు సైతం ఆస్వాదిస్తారని, ప్రస్తుతం ఎవ్వరూ తెలుగంకెలను రాసే పరిస్థితిలో లేరాని ,వాటి జాడ దాదాపుగా కనుమరుగై పోయింది. ఈ దుస్థితి తెలుగు లిపికి రాకుండా ఉండాలన్నదే మన అభిప్రాయం అన్నారు. ఒత్తులను ఎలా సంస్కరించవచ్చు అనే దానిపై వివిధ కోణాల్లో తెలుగు లిపిపై దాదాపు 11 సంవత్సరాలుగా కృషి చేసి కొన్ని సవరణలను ప్రతిపాదించడం జరిగింది. దీనిపై ఉస్మానియా యూనివర్సిటీ, రవీంద్రభారతి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీలలో జరిగిన పలు చర్చా కార్యక్రమాలలో పాల్గొని చర్చించడం జరిగింది. దీనికి పలువురు విద్యావేత్తలు, భాషాపండితులు, మేధావులు నన్ను ప్రశంసించడం జరిగింది. కానీ తెలుగు లిపి సంస్కరణకు మరింత ప్రచారం కల్పించాలని, భావితరాలు తెలుగు లిపికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చానని తెలిపారు. తెలుగు ను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

# పాఠశాలలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13:**

ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం



జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలకు అండగా నిలబడదాం

## మహాసభలను జయప్రదం చేద్దాం. సి ఐ టి యు

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు అండగా కార్మిక వర్గం నిలబడాలని, వ్యవసాయ కార్మికుల మహాసభలకు జిల్లాలోని కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ, వివి నరసింహ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిఐటీయూ జిల్లా కార్యాలయంలో ఐకేపీ వివోఎ లు ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలకు అండగా వారు చేసే పోరాటాలకు మద్దతుగా కార్మిక వర్గం అండగా నిలబడాలని అన్నారు. ఇప్పటికే యూనియన్ గవర్నమెంట్ లేబర్ కోడ్ ల ద్వారా కార్మిక వర్గ ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నదని, కార్మికుల వ్యవసాయ ఉపాధి కూలీలు ఐక్యంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. కార్మిక కర్షక మైత్రి స్ఫూర్తితో వ్యవసాయ కూలీలకు మద్దతుగా జూన్ 20 న మహబూబ్ నగర్ లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలకు జిల్లా లోని కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డ్యామ్ అంజి తిమ్మప్ప మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, పేదలు కొనుగోలు శక్తి పెరిగితేనే గ్రామీణ ప్రాంతాలలో పేదల బతుకులు మారుతాయని అటువంటి పేదలకు అండగా జరిగే మహాసభలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. వ్యవసాయ కూలీలు కార్మికులు ఒకరికి ఒకరు సహకరించుకుని తమ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ దిశగా జరిగే ఇటువంటి మహాసభలకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఐకేపీ వివోఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, సరస్వతి,తిరుమలేష్ ,కమిటీ సభ్యులు వెంకటరామయ్య,జయన్న, వెంకటేష్,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

**సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్**

**టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక**

**యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ**

**అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు**

**న్యూఢిల్లీ**

తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరపున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు.

ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన




తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13:**



ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం లో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ



స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయ, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సిసి రోడ్డు పనులు, 2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఓట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక, గుడి రేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాలపై ఉక్కుపాదం.. పెండింగ్ కేసులకు వేగం

## మాసిక నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాలు

**మహబూబ్‌నగర్, జూన్ 13 (అక్షర కలం):**





జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవల అందజేత లక్ష్యంగా జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో నమోదైన వివిధ నేరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో కేసులు, ఆస్తి సంబంధిత నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు, అనుమానిత ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గుట్కా, పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించిన ఎస్పీ, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, ఇతర అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్ పిటిషన్లు, ఫిర్యాదుల పరిష్కారం, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసుల పురోగతి, వారెంట్ల అమలు, పరారీలో ఉన్న నిందితుల అరెస్టులు, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, భూత్పూర్ సీఐ రామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మొతిరాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో కాంగ్రెస్ విజయానికి బీఎల్‌ఏలే కీలకం...

## పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..


**అక్షర కలం/ పినపాక.**



మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లోని డీవీ ఫంక్షన్ హాల్‌లో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల ( బీ ఎల్ ఏ) శిక్షణా శిబిరం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అలీ, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, "ఢిల్లీలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటం బూత్ స్థాయిలో విజయం సాధించినప్పుడే సార్థకమవుతుంది. ప్రతి బీఎల్‌ఏ ఒక సైనికుడిలా పనిచేయాలి అని అన్నారు. ప్రతిపక్షాల కుట్రలు, దొంగ ఓట్లు, డబ్బు ప్రలోభాలను తిప్పికొట్టి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరేయాలి" అని పిలుపునిచ్చారు.అదేవిధంగా బీఎల్‌ఓలు ( బీ ఎల్ వో), బీఎల్‌ఏల పాత్ర గురించి మాట్లాడుతూ, "ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిది,. ఆ పునాదిని పటిష్టంగా ఉంచడంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, దొంగ ఓట్లను గుర్తించడం, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంలో వారు సమన్వయంతో పనిచేయాలి. బూత్ స్థాయిలో అప్రమత్తతతో వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది" అని అన్నారు.డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ, "ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియ పూర్తయ్యే వరకు బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు. 18 సంవత్స రాలు నిండిన కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాలను ఫారం-6, 7, 8 ద్వారా వెంటనే పూర్తి చేయించాలి. బూత్ స్థాయిలో 100 శాతం పోలింగ్ జరిగేలా కృషి చేయాలి. పోలింగ్ రోజు ఏజెంట్ల చొరవే పార్టీ విజయాన్ని నిర్ణయిస్తుంది" అని సూచించారు. అలాగే బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఓటరు వివరాల ను క్షుణ్ణంగా పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో బూత్ స్థాయి సిబ్బంది నిర్వహించే బాధ్యతలు అత్యంత కీలకమైనవని ఆమె పేర్కొన్నారు.
అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బూత్ లెవల్ ఏజెంట్లు కేవలం ఓటరు జాబితా పనులకే పరిమితం కాకుండా పార్టీకి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమా లు ప్రజలకు చేరవేయడంలో బీఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలో రైతులు, మహిళలు, యువత, నిరుపేద కుటుంబాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా లక్షలాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఈ పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రతి కుటుంబాన్ని బీఎల్‌ఏలు, పార్టీ కార్యకర్తలు వ్యక్తిగతంగా కలవాలని, ప్రభుత్వం చేసిన మేలును వారికి వివరించాలని సూచించారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని వాస్తవాలతో తిప్పికొట్టే బాధ్యత కూడా బూత్ స్థాయి నాయకులపైనే ఉందన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ద్వారానే ఎన్నికల్లో విజయం సాధించగలమని పేర్కొంటూ, ప్రతి బీఎల్‌ఏ తన పరిధిలోని ప్రతి ఓటరును గుర్తించి వారితో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# గెలుపే నా టార్గెట్..

### నా కెప్టెన్సీ నాదే.. ఎవరి మాట నేను వినను

### ముంబై స్ట్రీట్ క్రికెట్ నుంచి చాలా నేర్చుకున్నా..

### టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



ఇండియా టీ20 టీమ్ కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ అఫీషియల్ గా అనౌన్స్ అయ్యాడు. సెలెక్షన్ కమిటీ మీటింగ్ లో 31 ఏళ్ల అయ్యర్ ను ఈ పొజిషన్ కు ఎంపిక చేశారు. మార్చి నెలలో ఇండియాకు టీ20 వరల్డ్ కప్ అందించి సక్సెస్ ఫుల్ గా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో అయ్యర్ బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఈ కొత్త రెస్పాన్సిబిలిటీ పై శ్రేయాస్ అయ్యర్ స్పందిస్తూ, కెప్టెన్ అయ్యాను కదా అని తన పర్సనాలిటీ ని మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరి నీడలోనో ఉండటానికి తాను ఇష్టపడనని, ముంబై లో కఠినమైన క్రికెట్ ఎన్విరాన్ మెంట్ లో పెరిగిన పాత శ్రేయాస్ లాగే ఉంటానని స్పష్టం చేశాడు. ముంబై లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఛాలెంజ్ లను ఫేస్ చేయడం అలవాట అయిందని అయ్యర్ ఒక ఈవెంట్ లో గుర్తు చేసుకున్నాడు. అక్కడ క్రికెట్ క్రేజ్ చాలా ఎక్కువని, స్ట్రీట్ లో ఆడే ప్రతి చిన్న పిల్లాడు ముంబై టీమ్ కు ఆడాలని కలలు కంటాడని చెప్పాడు. అటువంటి హై కాంపిటీషన్ నుంచి రావడం వల్లే తన మైండ్ సెట్ ఎప్పుడూ గెలవడం పైనే ఉంటుందని తెలిపాడు. ప్రతి మ్యాచ్ లో గెలవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం తన అలవాటని, ఈ కంపిటీటివ్ నేచరే తనను ఈ స్టేజ్ కి తీసుకొచ్చిందని అన్నాడు. ఇప్పుడు వచ్చిన కెప్టెన్సీ ఒక గ్రేట్ ఛాలెంజ్ అని, దీన్ని లీడ్ చేయడానికి తాను రెడీగా ఉన్నానని హింట్ ఇచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కు కెప్టెన్సీ ఇవ్వడం పై బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పాజిటివ్ గా రెస్పాండ్ అయ్యాడు. అయ్యర్ బాగా పర్ఫార్మ్ చేశాడని, ఈ కెప్టెన్సీ రోల్ కు అతడు వంద పర్సెంట్ అర్హుడని ప్రశంసించాడు. అలాగే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తీసేయడం అన్యాయం ఏమీ కాదని, సెలెక్టర్లు టీమ్ ఫ్యూచర్ ను దృష్టిలో ఉంచుకొని ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నారని గంగూలీ వ్యాఖ్యానించాడు. కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ కు ఐర్లాండ్ టూర్ ఫస్ట్ అసైన్ మెంట్ కాబోతోంది.




# పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రకంపనలు..

పాకిస్తాన్ టెస్టు జట్టులో కీలక మార్పులు చేసే విధంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో పాకిస్తాన్ 0 – 2తో ఘోర ఓటమిపాలయింది. ఈ సిరీస్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ కారణంతో టెస్టు హెడ్ కోచ్, కెప్టెన్లపై వేటు వేయాలన్న ఆలోచనలో పీసీబీ ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే సర్ఫరాజ్ అహ్మద్, షాన్ మసూద్‌ని తమ తమ బాధ్యతల నుంచి తొలగించే అవకాశం ఉంది. పాకిస్తాన్ జట్టులో ఎప్పుడూ ఏదోక ఇష్యూ నడుస్తూనే ఉంటుంది. కెప్టెన్లు, కోచ్ మార్పులో చాలా ఫాస్ట్‌గా ఉండే పీసీబీ ఇప్పుడు పాకిస్తాన్ టెస్టు టీమ్‌పై వేటు వేసేందుకు సిద్ధమైంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 0 – 2తో ఘోర ఓటమిపాలయింది.

# ధోనీ లేని లోటు స్పష్టంగా తెలిసింది

ఐపీఎల్ 2026 సీజన్ లో మోస్ట్ పాపులర్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ కు తీవ్ర నిరాశే మిగిలింది. పాయింట్ల టేబుల్ లో ఎనిమిదో ప్లేస్ కే పరిమితమై ప్లే ఆఫ్స్ రేస్ నుంచి తప్పుకుంది. టోర్నమెంట్ లో సంజూ శాంసన్ లాంటి ప్లేయర్స్ సాలిడ్ పర్ఫార్మెన్స్ తో ఆశలు రేపినా, ఓవరాల్ గా 14 మ్యాచుల్లో 12 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. ఈ దారుణమైన ఫెయిల్యూర్ పై సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ లో సీరియస్ గా స్పందించాడు. సంజూ శాంసన్, అకీల్ హొసేన్, అన్షుల్ కాంబోజ్ ఎఫర్ట్స్ ను మెచ్చుకుంటూనే, మేనేజ్‌మెంట్ వేలం స్ట్రాటజీలను కంప్లీట్ గా మార్చాలని సూచించాడు. కోట్ల రూపాయలు పెట్టి తప్పుడు ప్లేయర్లను కొనడం వల్లే టీమ్ కాంబినేషన్ దెబ్బతిందని అశ్విన్ విశ్లేషించాడు. వేలం వ్యూహాలను




పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పాడు. ఫైనల్ చేరిన రెండు టీమ్స్ వెంకటేష్ అయ్యర్, జేసన్ హోల్డర్ లను కేవలం రూ. 7 కోట్లకే దక్కించుకుని సక్సెస్ అయ్యాయని గుర్తు చేశాడు. ఒక్కొక్కరికి రూ. 14 కోట్లు చొప్పున భారీగా ఖర్చు పెట్టే కంటే, ఇలాంటి ఇద్దరు ప్లేయర్లను తీసుకుంటే యూత్, ఎక్స్ పీరియన్స్ పర్ఫెక్ట్ గా కుదిరేదని అభిప్రాయపడ్డాడు. సీఎస్కే ప్లేయర్స్ ఒక టీమ్ లాగా కలవలేకపోయారని, వారికి సరైన రోల్ క్లారిటీ లేకపోవడం మైనస్ అయిందని స్పష్టం చేశాడు. ఇతర టీమ్స్ కు సీజన్ స్టార్ట్ అవ్వడానికి ముందే ఇంజూరీలు అయితే, సీఎస్కే కి మాత్రం మ్యాచ్ లు మొదలయ్యాక ప్లేయర్స్ గాయపడ్డారని అశ్విన్ గుర్తు చేశాడు. ఎంత ట్రై చేసినా ఆ ఇంజూరీల ప్రెజర్ నుంచి టీమ్ కోలుకోలేకపోయిందని అన్నాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా

CINEMA




# దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహ న్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార కనిపించనున్నారని సమాచారం.



# కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది.



# పూరీ మార్క్...స్లమ్ డాగ్ టీజర్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్–ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ –33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఇన్-సర్వీస్' ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి -- తపస్ డిమాండ్



అక్షరకలం నల్గొండ

1 ఏప్రిల్ 2010 కంటే ముందు నోటిఫికేషన్ల ద్వారా న్యాయబద్ధంగా నియామకమైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం తపస్' జిల్లా అధ్యక్షులు బత్తిని భాస్కర్ గౌడ్ మాట్లాడారు.ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం 2028 ఆగష్టు 31 లోపు టెట్ పాస్ కావాలని, లేదంటే సర్వీస్ తొలగించే అవకాశం ఉందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణలో సుమారు 30,000 మంది ఉపాధ్యాయులు దీనివల్ల ప్రభావితం కానున్నారు. గత 30 ఏళ్లుగా తాము ఎంచుకున్న నిర్దిష్ట సబ్జెక్టులను బోధిస్తున్న ఉపాధ్యాయులకు, సంబంధం లేని అన్ని సబ్జెక్టులతో టెట్ పరీక్ష నిర్వహించడం అసంబద్ధమని 'తపస్' నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నిసార్లు ప్రత్యేక టెట్ నిర్వహించినా దీనివల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు ఇప్పటికే దీక్ష, నిష్ఠ వంటి ఆన్‌లైన్ వృత్యంతర శిక్షణల ద్వారా సమకాలీన బోధనాంశాలను నేర్చుకుంటున్నారని గుర్తుచేశారు. ?కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో తపస్ప్ర ధాన కార్యదర్శి రేణికుంట్ల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఇరుగు శ్రీరాం, రాష్ట్ర వెబ్ కన్వీనర్ కంచనపల్లి విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దోటి కిషన్ ప్రసాద్, జిల్లా కోశాధికారి నంద్యాల నర్సిరెడ్డి, మునుగోడు మండల అధ్యక్షుడు మిర్యాల మురళి, నల్లగొండ రూరల్ శాఖ ప్రధాన కార్యదర్శి నిమ్మనగోటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవనికి ఆహ్వానం



అక్షరకలం, చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. కళ్యాణ మహోత్సవానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రం అందజేసారు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉప్పరగొని యాదయ్య,మాజీ అధ్యక్షులు నిమ్మల నాగేష్ ముదిరాజ్.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దుర్గం లాలయ్య,పెద్దమ్మ గుడి చైర్మన్ గట్టు గోపాల్,మాజీ చైర్మన్ పూలమోని వెంకటేష్,వార్డు మెంబర్లు నీళ్ల అనిత శంకర్,చింతల శైలజ సత్యనారాయణ,ఉప్పరగొ ని రమేష్ దుర్గం జంగయ్య,ఉప్పర గోని యాదయ్య,వెంకటేశం,వ ుదిరాజ్ సంఘం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చౌటుప్పల్ కాంగ్రెస్ నేతలు

అక్షర కలం,చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్,చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. నేపథ్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్,కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తమకు అధ్యక్షులు గా అవకాశం కల్పించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీకి కంకణ బద్ధులమై పనిచేస్తామన్నారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఆకాష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు,పాల్గొన్నారు.



# నల్గొండ "బత్తాయి" దేశానికే మేటి

సాగులో నల్గొండను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పంట మార్పిడిపై రైతులు దృష్టి సారించాలి

నల్గొండ బత్తాయికి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్‌లో త్వరలోనే సిట్రస్ రైతుల సమస్యలపై ప్రత్యేక సమావేశం.

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం








రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికై అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. నల్గొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకొస్తుందని, జిల్లాలో గతంలో 4 లక్షల ఎకరాల బత్తాయి సాగు కాగా, కాలక్రమేనా వివిధ కారణాలవల్ల అది 40 వేల ఎకరాలకు తగ్గడం బాధాకరమన్నారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా రైతులు కూడా మారాల్సిన అవసరం ఉందని, ఎప్పుడు వరిపైనే ఆధారపడకుండా బత్తాయి లాంటి పంటలు, ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. పంట మార్పిడిపై తప్పనిసరి దృష్టి సారించాలని ,ఈ విషయంలో రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పంటలు సాగుచేసే రైతులకు సహకారం అందిస్తున్నదని, ముఖ్యంగా వరి పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, 500 రూపాయల బోనస్ ఇచ్చి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తుదన్నారు. అయితే బత్తాయికి పేరు ప్రఖ్యాతులుగాంచిన నల్గొండ జిల్లాలో తిరిగి బత్తాయిని ఎక్కువ మొత్తంలో సాగు చేయాల్సిన అవసరం ఉందని, బత్తాయి ఆరోగ్యపరంగా కూడా మనిషికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యాన పంటల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్ కు శంకుస్థాపన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు పంట మార్పిడితోపాటు, ఉద్యాన పంటలను సాగు చేయాలని, నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అవసరమైతే హైదరాబాద్ లో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సిట్రస్ ను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో సిట్రస్ రైతుల సమస్యలు, భవిష్యత్తు అవకాశాలు, ఆధునిక సాగు పద్ధతులు, మార్కెటింగ్ ఎగుమతులు ,తదితర విషయాలపై ఆలోచిస్తామన్నారు.కార్యక్రమానికి హాజరైన పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయిలో అనేక కొత్త రకం వంగడాలు వచ్చాయని, రైతులకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయని, ముందు నుండి నల్గొండ బత్తాయికి ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రైతు బీమా, మహిళలకు రుణాలు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నదన్నారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి, చెవిటి వెంకన్న, పావని రెడ్డి, ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లాల అధికారులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను మంత్రి ప్రారంభించారు.

# ప్రభుత్వ బడుల మూతపై "పొలిటికల్ పార్టీల" మౌనం

బడుల బలోపేతానికి యుటిఎఫ్ కృషి చేయాలి

ప్రీ-ప్రైమరీ పోస్టులను భర్తీ చేయాలి

రెగ్యులర్ ఎంఈఓ, డీఈఓలను నియమించాలి

అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాల్సిందే

పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం




యూటీఎఫ్ భవన్‌లో బక్కా శ్రీనివాసా చారి అధ్యక్షతన శనివారం టీఎస్ యూటీఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదును (ఎన్‌రోల్‌మెంట్) పెంచడానికి యూటీఎఫ్ కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నేడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభుత్వ బడుల మూతపై నోరు మెదపడం లేదని ఆరోపించారు. వలసల కారణంగా పట్టణాల్లో జనాభా పెరుగుతోందని, అందుకు అనుగుణంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, చండూరు వంటి ప్రాంతాలలో మరిన్ని ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ పాఠశాల తరహాలోనే కేశరాజుపల్లి, రామగిరి, జేబీఎస్, అక్కలాయిగూడెం పాఠశాలలను అభివృద్ధి చేయాలని, దీనిపై స్థానిక మంత్రి చొరవ చూపాలని కోరారు.

## అక్రమ డిప్యుటేషన్లపై సమరం..

టీచర్ల సర్దుబాటు అనేది విద్యార్థుల సౌకర్యం కోసమే ఉండాలని, ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం కాదని స్పష్టం చేస్తూ అశాస్త్రీయ డిప్యుటేషన్లను ఆయన పూర్తిగా ఖండించారు. అక్రమ డిప్యుటేషన్ల రద్దుకై అవసరమైతే ప్రజలను సమీకరిస్తామని హెచ్చరించారు. ?ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించాలిసమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం ప్రభుత్వాన్ని పలు డిమాండ్లు చేశారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్‌తో కూడిన కిట్‌ను అందించాలి. నల్లగొండ జిల్లాలో మంజూరైన 124 ప్రీ-ప్రైమరీ సెక్షన్లకు ఇన్స్ ట్రాక్టర్ ఆయా పోస్టులను వెంటనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి. అలాగే రెగ్యులర్ ఎంఈఓ, డిప్యూటీ డిఈఓ, డిఇఓ లను నియమించాలి. ప్రభుత్వం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విధివిధానాలను తక్షణమే అమలు పరచాలి. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలి. జూలై నెలలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ చేపట్టాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకేసారి అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఎఫ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి. నాగమణి, ఎడ్ల సైదులు, నర్రా శేఖర్ రెడ్డి, జి. అరుణ, గేర నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, భాను ప్రకాష్, మధుసూదన్, పగిడిపాటి నరసింహ, ప్రభాకర్, బి.సురేందర్ రెడ్డి, ఎరనాగుల సైదులు, శ్యాం కుమార్, శ్రీలత, వరలక్ష్మి, రాగి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# తెలంగాణ రోడ్డు రవాణా రంగంలో నూతన శకం

## రూ.14 వేల కోట్లతో 'హ్యామ్' రోడ్ల మహా యజ్ఞం

## ఈనెల 17న సిఎం రేవంత్ రెడ్డి రాక

## నలొండ జిల్లా, కనగల్ మండలంలో 14 వేల కోట్లతో హ్యాం రోడ్లకు శంకుస్థాపన

## లక్ష మందితో భారీ బహిరంగ సభ

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

## రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో 14 వేల కోట్ల రూపాయల వ్యయంతో హ్యాం పద్ధతిలో నిర్మించనున్న డబుల్ రోడ్ల పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ స్థలాన్ని, హ్యాం రోడ్ల పైలాన్, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ 17వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా, కనగల్ మండలం రానున్నారని ,రాష్ట్ర చరిత్రలోనే కని విని ఎరగని రీతిలో ఒకే రోజున ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చే మొదటి ప్యాకేజీ కనగల్ మండలం, ధర్వేశిపురం నుండి డిండి వరకు నిర్మించే రహదారి తో రాష్ట్రంలోని అన్ని హ్యాం రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి రహదారులతోపాటు, మరో 7 వేల కోట్ల రూపాయలతో గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లా కేంద్రం వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు నిర్మించనున్నామని, వీటికి వచ్చేవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు .రెండు సంవత్సరాలలో హ్యాం రోడ్లన్నింటిని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోడ్లు ఉంటేనే పరిశ్రమలు, సంక్షేమ ఉంటాయని, అందువల్ల గడచిన సంవత్సరం కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసి రిజర్వాంట్ ద్వారా అప్పుగా నిధులు తీసుకుని రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్ బి సి సొరంగం కూడా హ్యాం రోడ్లు పూర్తయ్యేలోగా అంటే 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. దీని ద్వారా జిల్లాలో రెండు పంటలకు సాగు నీరు అందుతుందన్నారు. ఇది తన కలల ప్రాజెక్టు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వీటితోపాటు, ఏఆర్పి కాలువలల లైనింగ్ కు 450 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, ఈ శంకుస్థాపన కార్యక్రమం కూడా అదేరోజు ఉంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే హ్యాం రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో తాగునీటిపై ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం జరిగిందని, ఈ పనులకు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి కనగల్ లోనే శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ఈ సంవత్సరం నల్గొండ నియోజకవర్గంలో అత్యధికంగా 2,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం పండించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 1800 కోట్ల రూపాయల విలువచేసే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. రోడ్లు బాగుంటేనే పరిశ్రమలు, వ్యవసాయం వస్తాయని, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. కేంద్ర సిఆర్ఎఫ్ నిధుల ద్వారా నల్గొండ నుండి దర్వేశిపురం వరకు స్ట్రెయిట్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, కనగల్ జంక్షన్ అభివృద్ధి ని కూడా హ్యాం రోడ్ల లో పెట్టడం జరిగిందన్నారు. వీటితోపాటు, హైదరాబాద్ నుండి విజయవాడ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా మంజూరు అయిందని, ఇదేకాక దాని పక్కనే బుల్లెట్ ట్రైన్ డిపిఆర్ కూడా సిద్ధమవుతున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న సభకుసుమారు లక్ష మంది ప్రజలు ఈ సభకు హాజరు కానున్నట్లు మంత్రి వెల్లడించారు.ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని , ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు లేకుండా, బహిరంగ సభకు హాజరయ్యే ప్రజల కోసం అవసరమైన తాగునీరు, టెంట్లు, వాహనాలు ,ఇతర అన్ని సౌకర్యాలు సమకూర్చాలని, ఎవరు ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సభా వేదిక, వాహనాల పార్కింగ్ ,లైటింగ్ ,లైవ్ టెలికాస్ట్, అలాగే ఇతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అంతేకాక పైలాన్ నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి కార్యక్రమం విజయవంతం అయ్యేలా అధికారులు, అనధికారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతు రుణమాఫీ తో పాటు, రైతు భరోసా ఇస్తున్నదని, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ఉచిత బస్సు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, అలాగే 200 కోట్ల రూపాయలతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటివి చేపట్టినట్లు వెల్లడించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ శంకర్ నాయక్, డిఎస్పి శివరాం రెడ్డి, ఆర్ అండ్ బి డిఈ గణేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షునికి 'రెడ్ క్రాస్' లైఫ్ మెంబర్‌షిప్

అక్షరకలం బీబీనగర్



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ ఐడెంటిటీ కార్డును స్థానిక సీఐ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా మండల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పడకంటి శ్రీనివాస్‌కు అందజేశారు. ?ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో రెడ్ క్రాస్ చేపట్టే సేవా కార్యక్రమాల్లో తాను భాగస్వామినవుతానని ప్రకటించారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని, అలాగే రోడ్డు భద్రతా నియమాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ డైరెక్టర్ డాక్టర్ షేక్ హమీద్ పాషా, మండల రెడ్ క్రాస్ సభ్యులు మంచాల అనిల్ కుమార్, బక్కన్న నరసింహ, మంచాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ లో చేరిన ప్రముఖ న్యాయవాది మంద నగేష్

అక్షరకలం నల్గొండ



నల్గొండ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, నల్గొండ అభివృద్ధి ప్రదాత గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మంద నగేష్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంద నగేష్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని, కెసిఆర్ నాయకత్వంలో పనిచేయడానికి యువత ముందుకు రావాలని సూచించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నల్లగొండ జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, భూపాల్ రెడ్డి తదితరులున్నారు.

# జార్పుల తండాలో విషాదం

## --బావి గుంతలో పడి ఇద్దరు బాలుర అకాల మృతి

అక్షరకలం దేవరకొండ



దేవరకొండ మండలం జార్పుల తండాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తండాకు చెందిన జార్పుల హర్షవర్ధన్, జార్పుల బిట్టు ప్రమాదవశాత్తు బావి గుంతలో పడి మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ శనివారం జార్పుల తండాలో పర్యటించారు. మృతుల నివాసాలకు వెళ్లిన ఆయన, బాలుర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఇరు కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ హర్షవర్ధన్, బిట్టుల అకాల మరణం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఇద్దరు పిల్లలు మృత్యువాత పడటం ఆ కుటుంబాలకు కోలుకోలేని దెబ్బ అని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాలుర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే తండాకు చెందిన జార్పుల బోదు ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న కిషన్ నాయక్, వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి సైతం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ వెంట సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ జై హింద్ రెడ్డి, రేపని ఇద్దయ్య, రవీందర్ రెడ్డి, ఆల్వాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ముదిగొండ హరిదాస్, వాగ్య నాయక్, సంతోష్, నర్సింహా, ఖాజా, చిత్రం రమేష్, నేనావత్ శ్రీను, గణేష్, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఎ.ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ. ఐటిడిఎ,పిఓ,బి.రాహుల్,

అక్షర కలం / భద్రాచలం

గిరిజననిరుద్యోగయువతీ,యువకులకు భద్రాచలంఐటిడిఏఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైటిసి,శిక్షణాకేంద్రంలో పద్దెనిమిదిసంవత్సరాలనుండిముప్పై మూడు సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ,యువకుల,కు మాత్రమేఉచితశి క్షణఅందించిఉపాధి అవకాశాలుక



ల్పించడంజరుగుతుందనిఐటిడిఏప్రాజెక్టుఅధికారి బి.రాహుల్,శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం కంప్యూటర్ కోర్సుమొదటి.బ్యాచ్,బ్యూటీషియన్ కోర్సు రెండు బ్యాచ్‌లు మాత్రమే సీట్లుమిగిలిఉన్నాయనిఉచితభోజనం మరియు వసతి శిక్షణఅనంతరం సర్టిఫికెట్ఉపాధిఅవకాశాలుకల్పించడంజరుగుతుందని ఆయనఅన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగయువతీ యువకులు ఈ నెల ఇరవై వ తేదీ లోగా తమ లగేజ్‌తో నేరుగా వైటిసి, శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని,రిజిస్ట్రేషన్ పూర్తయినవెంటనేతరగతులుప్రారంభమవుతాయని ఆయనఅన్నారు

# ఓటరు జాబితాపై నిర్లక్ష్యం వహిస్తే ఓటమే

## కార్యకర్తలకు మంత్రి కోమటిరెడ్డి దిశానిర్దేశం

## బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ దుర్మార్గం

## మమతా బెనర్జీ, స్టాలిన్ ఓటమికి ఓట్ల తొలగింపే కారణం

## మంత్రి సంచలన వ్యాఖ్యలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

ఎన్నికల్లో ఓటమి ఎప్పుడూ పోలింగ్ రోజు ప్రారంభం కాదని, బూత్ స్థాయిలో నిర్లక్ష్యం జరిగిన రోజే మొదలవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎంఎన్ ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏలు) కోసం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.



### బీజేపీపై తీవ్ర విమర్శలు...

బీజేపీ కేవలం ఓట్లనే కాకుండా సీట్లను కూడా చోరీ చేస్తోందని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను ఆయన తీవ్రంగా ఖండించారు. బలం లేని చోట బీజేపీ మూడో అభ్యర్థిని నిలబెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు.

### ఓట్ల తొలగింపుపై ఆందోళన..

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించబడ్డాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్: 2.89 కోట్లు, పశ్చిమ బెంగాల్: 91 లక్షలు,తమిళనాడు: 74 లక్షలు, గుజరాత్: 68 లక్షలు,మధ్యప్రదేశ్: 34 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని వివరించారు. తమిళనాడులో స్టాలిన్ నియోజకవర్గంలో 71 వేల ఓట్లు, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ భవానీపూర్ నియోజకవర్గంలో 44 వేల ఓట్లు తొలగించడం వల్లే వారు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారని గుర్తుచేశారు.

### కార్యకర్తలకు దిశానిర్దేశం..

జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే ఇంటింటి గణనను, జూలై 31న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాను బీఎల్ఏలు క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. అర్హులైన ఒక్క కాంగ్రెస్ ఓటు కూడా వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఒక్క అర్హుడి పేరు కూడా మిస్ కాకూడదని పేర్కొన్నారు. అనంతరం టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ ఎస్ఐఆర్ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని బీఎల్ఏలకు మార్గనిర్దేశనం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, ప్రత్యేక ట్రైనర్ వెంకట రమణ ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కల్పించారు. ?ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అహ్మద్ అష్రఫ్ అలీ అమేర్, నల్లగొండ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారింది

## జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఐఎంఏ జగిత్యాల ముందడుగు

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జూన్ 13 : (అక్షర కలం)



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26, 2026న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్ 3కే రన్" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. "రన్ స్ట్రాంగ్ -- లివ్ ఫ్రీ, సే నోటు డ్రగ్స్లి అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ స్థానిక వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు మరియు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బందెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించిన మరకల్ మండల బిజెపి నాయకులు ;



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,12)

12 సంవత్సరాల మోదీ ప్రభుత్వ విజయోత్సవాలలో భాగంగా మరికల్ మండలం లోని ఎలిగండ్ల గ్రామం లోని శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విశ్వగురు,మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయురారోగ్యాలను, శక్తినివ్వాలని ప్రార్థిస్తూ అభిషేకం చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ మండలధ్యక్షుడు మంగలి.వేణుగోపాల్, ఎలిగండ్ల గ్రామ సర్పంచ్ అశ్వినినరేష్ గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి,. ఈ కార్యక్రమ జిల్లా కో కన్వీనర్ బండగొండ భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి కొండన్న. మండల కన్వీనర్ రాజేష్ యాదవ్. ఓబిసి మోర్చా జిల్లా కో కన్వీనర్ వడ్డే శ్రీరామ్. మండల ప్రధాన కార్యదర్శి రమేష్. నరేష్ గౌడ్. సీమ శివకుమార్. టైలర్ నర్సింలు, మహేష్ ,రాము తిరుపతయ్య, పెద్ద ఆంజనేయులు, రామలింగప్ప, రాఘవేంద్ర గౌడ్, బసవరాజ్ గౌడ్ బీములుగౌడ్, వడ్డే గురు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో పైన చర్యలు తీసుకోవాలి. బీఎస్పీ



అక్షర కలం సిద్దిపేట జూన్ 13

బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా లో కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలలు ఎల్కేజీ యూకేజీ కి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సామాన్య మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న కార్పొరేట్ మరియు ప్రైవేట్ స్కూల్లో పైన వెంటనే చర్యలు తీసుకోవాలి పాఠశాలలు మొదలుకాకముందే బుక్స్ యూనిఫామ్ పాఠశాలల లోనే అధిక ధరలకు అమ్మతు విద్య హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కుతున్న అన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే దీనిపైన బహుజన్ సమాజ్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమస్తుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు రోమాల బాబు,సిద్దిపేట అసెంబ్లీ ఇన్చార్జి పంగబాబు, బబూత్ అధ్యక్షుడు లతానియల్ , యాదగిరి పాల్గొన్నారు.

## పాలమాకుల ప్రజల ప్రేమాభిమానాలే నాకు అతిపెద్ద పురస్కారం

అక్షర కలం సిద్దిపేట జూన్ 13:

2026 ఎండాకాలం మొత్తం ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే అక్కాచెల్లెమ్మలు, అన్నదమ్ముల కోసం చల్లని తాగునీరు (కూల్ వాటర్) అందించడం నా బాధ్యతగా భావించాను.ఆ చిన్న సేవకు గుర్తింపుగా పాలమాకుల గ్రామ ఉపాధి హామీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, అక్కలు, చెల్లెలు, అన్నలు, తమ్ముళ్లు కలిసి నన్ను ఘనంగా సన్మానించడం నాకు ఎంతో ఆనందాన్ని, మరింత బాధ్యతను కలిగించింది. ఈ సన్మానం వ్యక్తిగతంగా గంగుల రవి



యాదవ్ కి కాదు.గ్రామ సేవను గౌరవించే పాలమాకుల ప్రజల గొప్ప మనసుకు నిదర్శనం. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలు, నమ్మకమే నాకు బలం. భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించినంతకాలం పాలమాకుల గ్రామ అభివృద్ధి, ప్రజా సేవ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.ప్రజల చిరునవ్వులే నాకు ప్రేరణ. ప్రజాసేవే నా లక్ష్యం అని అన్నారు.

## సిద్దిపేట ఏబీవీపీ నూతన నగర కార్యదర్శిగా తిప్పేట తరుణ్ ఎన్నిక



అక్షర కలం సిద్దిపేట జూన్ 13:

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎ బి వి పి సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక మాస్టర్ మైండ్స్ స్కూల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ పాల్గొని గత 77 ఏళ్లగా ఏబీవీపీ దేశసేవలో బాగంగా జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా సమాజ సేవ చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ కార్యకర్తలను ఉద్దేశించి మనమంతా జాతీయ భావాలతో దేశానికి సేవ చేస్తూ విద్యారంగ సమస్యలను పరిష్కరించుటకై కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు అనంతరం ఎ బి వి పి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఉ మెదక్ విభాగ్ (ఉమ్మడి జిల్లా) కన్వీనర్ సావుల ఆదిత్య నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది అందులో భాగంగా సిద్దిపేట నూతన నగర కార్యదర్శిగా తిప్పేట తరుణ్, నగర ఉపాధ్యక్షులుగా రవీందర్,కార్తీక్, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా నితిన్, లోకేష్, ఆకాంక్ష్, మహిళ కన్వీనర్ గా అమూల్య, మిషన్ సాహసి కన్వీనర్ గా అఖిల, ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా యోగేష్, ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ గా ప్రశాంత్, ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ గా అజయ్, కో-కన్వీనర్ గా శ్రీకాంత్, ఖేల్ కన్వీనర్ గా శివ సాయి, కో కన్వీనర్ గా కౌశిక్, సోషల్ మీడియా కన్వీనర్ గా భాస్కర్, కో కన్వీనర్గా హరీష్ ని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి: షీ టీమ్ పోలీసులు

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,12)

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మక్తల్: మక్తల్ బస్టాండ్‌లో షీ టీమ్ పోలీసులు ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు ప్రయాణికులకు పలు భద్రతా సూచనలు చేశారు. బస్సుల్లో ప్రయాణించే సమయంలో తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్లు, బ్యాగులు తదితర విలువైన వస్తువులను ఎల్లప్పుడూ జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. బస్సు ఎక్కే సమయంలో లేదా దిగే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు, పానీయాలు స్వీకరించరాదని, మాయ మాటలు చెప్పి విలువైన వస్తువులను బ్యాగుల్లో పెట్టమని లేదా ఇతరత్రా భద్రపరచమని చెప్పినా నమ్మరాదని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎవరైనా మోసపూరితంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలను ఎవరైనా అసభ్యంగా తాకినా, వేధింపులకు గురిచేసినా లేదా అనుచితంగా ప్రవర్తించినా వెంటనే షీ టీమ్ సెల్ నంబర్ 8712670398కు సమాచారం




ఇవ్వాలని తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీస్ అధికారులు బాలరాజు, చెన్నప్ప మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలా వరకు నేరాలను నివారించవచ్చని తెలిపారు. భద్రత విషయంలో ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది కవిత, జ్యోతి, స్థానికులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన "చల్లా కృష్ణ"



అక్షర కలం/ దానవాయిగూడెం:

పాలేరు నియోజకవర్గ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన పందుల ధనుజయ్ఇటీవల కాలంలో అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం టౌన్ జనరల్ సెక్రటరీలి" చల్లా కృష్ణలి " మృతుల కుటుంబాన్నిలి పరామ ర్శించి , ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు, శనివారం" దశదిన కార్యక్రమానికి" తమ వంతు సహాయంగాచల్లా కృష్ణన్న 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికిఎల్లపుడూలి కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో లిచల్లా కృష్ణ టీమ్ సభ్యులు పాల్గొనడం జరిగంది.

## అక్రమ ఇసుక రవాణాపై వైరా పోలీసుల ఉక్కుపాదం

### వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు

### అక్రమార్కులపై హిస్టరీ షీట్లు తెరిచేందుకు చర్యలు చెపట్టిన వైరా పోలీసులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి చెందిన సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తరలిస్తూ.... ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తూ.. వ్యవస్థీకృత కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఇసుక మాఫియాపై వైరా పోలీసులు రి ఉక్కుపాదం మోపారు.వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దొనబండ రీచ్ నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు, ఈ-వే బిల్లులు లేకుండా సుమారు 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు.ఈ కేసులో ఖమ్మంకు చెందిన చల్లమల్ల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చల్లమల్ల సుమంత్ కుమార్, అలాగే లారీ డ్రైవర్ కొండేటి ఉపేందర్లను అరెస్టు చేశారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన అశోక్ లేలాండ్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన మహీంద్రా థార్ కారు, విక్రయాల కోసం ఉపయోగిస్తున్న టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి, ఖమ్మం మరియు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించారు.ఈ సందర్భంగా నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, చల్లమల్ల సుమంత్ కుమార్‌పై మొత్తం 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వాటిలో పలు కేసుల్లో శిక్షలు కూడా విధించబడ్డాయి. అదేవిధంగా, చల్లమల్ల వెంకటేశ్వరరావుపై ప్రస్తుతం నమోదైన ఈ కేసుతో కలిపి మొత్తం 4 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా అక్రమ ఇసుక రవాణా, దొంగతనం, మోసం వంటి నేరాల్లో వీరు ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న ఇటువంటి వ్యక్తులపై హిస్టరీ షీట్లు ప్రారంభించడం, నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, అవసరమైతే రౌడీ షీట్లు తెరవడం వంటి కఠిన చర్యలు చేపట్టబడతాయి.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955